## బ్రాహ్మణ సంక్షేమానికి కృషి



విలేకరులతో మాట్లాడుతున్న బ్రాహ్మణ పరిషత్ సభ్యురాలు సుమలతా శర్మ

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 28: బ్రాహ్మణ ఐక్యత, సంక్షేమానికి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కృషి చేస్తున్నదని పరిషత్ సభ్యురాలు సంగెపల్లి సుమలతా సుధాకర్ అన్నారు. ఆర్మూర్‌రోడ్‌లోని లక్ష్మీప్రియనగర్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయ ప్రాంగణంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా గూపన్‌పల్లిలో సుమారు రూ.12 కోట్లతో బ్రాహ్మణ సదరం నిర్మించడంతోపాటు వివేకానంద విదేశీ విద్య, బెస్ట్ స్కీం, వేదపాఠశాలలకు ఆర్థిక సహాయం, పేదవిద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు వివరించారు. సూర్యాపేట, సిద్దిపేట, చేర్యాలలో బ్రాహ్మణ సదనాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆలయాల అభివృద్ధి, బ్రాహ్మణుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ధూపదీప నైవేద్య పథకంతోపాటు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ప్రతినిధి గాయత్రీ కులకర్ణి, ప్రవీణ్ కులకర్ణి, చంద్రశేఖర శాస్త్రి, అశోక్, పండిత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వైన్‌షాపులు, కల్లు బట్టీలు బంద్

నిజామాబాద్ క్రైం, నవంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 30న ఉన్న నేపథ్యంలో వైన్‌షాపులు, కల్లు బట్టీలను బంద్ ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్స్ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటింగ్ నేపథ్యంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 నుంచి ఈ నెల 30వ తేదీ రాత్రి వరకు వైన్‌షాపులు, బార్లు, కల్లుడిపోలు, కల్లు బట్టీలు, ఐఎంఎల్ డిపోలు బంద్ ఉంచాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా డిసెంబర్ 3వ తేదీన కూడా కౌంటింగ్ ముగిసే వరకు మద్యం అమ్మకాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ పర్యవేక్షణలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, సూపరింటెండెంట్ కె.మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జిల్లావ్యాప్తంగా అన్ని వైన్‌షాపులకు సీల్ వేయించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నగరంలో వడగండ్ల వాన

- ఈదురు గాలులు.. దంచికొట్టిన వాన



నగరంలో కురుస్తున్న వర్షం,
ఇన్‌సెట్‌లో వడగండ్లు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 28 : జిల్లాకేంద్రంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఈదురు గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో వడగండ్ల వాన కురిసింది. 45 నిమిషాల పాటు భారీ వర్షం కురవడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. దీంతో నగరంలో చలితీవ్రత మరింత పెరిగింది. మంగళవారం ప్రచార ముగింపు ఉండడం, ప్రచార సమయం ముగిసిన తర్వాత భారీ వర్షం కురవడంతో అభ్యర్థులు ఊపిరి పిల్చుకున్నారు.

# ప్రతిపక్ష పార్టీలతో అప్రమత్తంగా ఉండాలి

- సోషల్ మీడియాలో అసత్యప్రచారాలు, వదంతులు నమ్మొద్దు
- బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి, నవంబర్ 28 : ప్రతిపక్ష పార్టీల నాయకులతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తొమ్మిదేండ్లలో నగరం శాంతిభద్రతలకు నిలయంగా మారిందని, ఎటువంటి ఘర్షణలు లేకుండా శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవించారని తెలిపారు. నిజామాబాద్ నగరం ప్రశాంతంగా ఉంటే చూడలేని కొన్ని పార్టీలు సోషల్ మీడియాలో అసత్యప్రచారాలు, వదంతులు సృష్టిస్తున్నారన్నారు. నగరంలో ఓ వర్గం వారు మరో వర్గం వారిపై దాడిచేశారని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన సంఘటనలు మన ప్రాంతంలో జరిగాయని, ఫేక్ వీడియోలు, ఫొటోలు, సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, ప్రజల మనోభావాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని వీరితో అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలో గంగా జమున తెహజీబ్ సంస్కృతి నెలకొన్నదని, అధికారంలోకి రావడానికి ఇతర పార్టీల నేతలు ప్రజలను బలి చేస్తున్నారని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ నగర రూపురేఖలు మార్చామని, అభివృద్ధి ప్రజల కండ్లెదుటే ఉందని అన్నారు. ఓటు ఐదు సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయిస్తుందని, అభివృద్ధి చేసిన పార్టీలను ఆదరించాలని అన్నారు. నగరం మరింత అభివృద్ధి చెందేందుకు తనను నన్ను ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, రెడ్‌కో చైర్మన్ ఎస్ఏ అలీం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో కాంగ్రెస్ బరితెగింపు ..!

- స్థానికంగానే కొడంగల్ బృందాలు
- ఎలక్షన్ ఏజెంట్ల పేరుతో ఇక్కడే తిష్ట
- కాంగ్రెస్ నాయకుడి ఆఫీసులో సోదాలు
- డబ్బు సంచులున్నట్లుగా అనుమానం?

నిజామాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి నియోజకవర్గంలో ప్రజాబలాన్ని పొందలేకపోయిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తనదైన మార్కుతో గలాబా సృష్టించేందుకు సిద్ధమయ్యాడు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం మంగళవారం సాయంత్రం 5 గంటల తర్వాత ప్రచారతంతు ముగిసింది. ఈ దశ దాటిన తర్వాత నాన్ లోకల్ క్యాండిడేట్లు నియోజకవర్గాన్ని వదిలి వెళ్లాల్సి ఉంటుంది. కానీ రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి మాత్రం ఎలక్షన్ ఏజెంట్ ధ్రువీకరణ పత్రం ఉందంటూ ఇక్కడే తిష్ట వేసుకొని ఉండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు.. కొండల్ రెడ్డి ఉంటున్న ప్రాంతానికి వెళ్లగా వారితో అడ్డదిడ్డంగా మాట్లాడటంతో పాటు ఇక్కడే ఉంటానంటూ చెప్పడంతో పరిస్థితి తీవ్రరూపం దాల్చింది.

**అనుమానాలెన్నో..?**

సాధారణంగా ఆయా పార్టీలకు అభ్యర్థుల తరపున ఎలక్షన్ ఏజెంట్ పాస్‌లను ఈసీ జారీచేస్తుంది. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఓటర్ల వివరాలను చెక్ చేసుకొని పంపించడం వీరి పని. స్థానికుడు కానటువంటి కొండల్ రెడ్డికి ఎలక్షన్ ఏజెంట్ పాస్ ఎందుకు అవసరం వచ్చిందన్నది ప్రశ్నగా మారింది. ఇదిలా ఉండగా కొండల్‌రెడ్డి పేరు మీద జారీ చేసిన పాసులో స్వతంత్ర అభ్యర్థి తరపున రేవంత్‌రెడ్డి సోదరుడు పాస్ పొందినట్లుగా తెలుస్తున్నది. అందులో వివరాలను ఎ.కొండల్‌రెడ్డి అని పేర్కొన్నప్పటికీ పోటీచేస్తున్న అభ్యర్థి పేరు స్థానంలో మాత్రం వివరాలు సరిగా కనిపించకుండా జాగ్రత్త పడుతుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్ హోదాలో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండగా.. ఆయన సోదరుడు కొండల్‌రెడ్డికి మాత్రం స్వతంత్ర అభ్యర్థి తరపున ఏజెంట్ పాస్ ఎందుకు అవసరం వచ్చిందనే విషయంపై కొండల్ రెడ్డి నోరు విప్పడం లేదు. ఒకవేళ ఎలక్షన్ ఏజెంట్ పాస్ తీసుకున్నప్పటికీ పోలింగ్ రోజు మాత్రమే వారికి ఆ పాస్‌తో పని ఉంటుంది.

**నోట్ల సంచులు..?**

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ పోలింగ్‌కు ముందు భారీ స్కెచ్ వేసింది. ఓటర్లకు డబ్బులు ముట్టజెప్పి ఓట్లు వేయించుకోవాలని చూస్తుండడంతో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. సమాచారం అందుకున్న ఎన్నికల సంఘం ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించింది. కాంగ్రెస్ పట్టణ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన కార్యాలయంలో నోట్ల సంచులున్నట్లుగా అనుమానంతో ఫిర్యాదు రాగా ఎన్నికల నిఘా బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. రియల్ ఎస్టేట్ కార్యాలయంలో డబ్బుల సంచులు దొరికినట్లుగా తెలుస్తోంది. మొత్తం విలువ రూ.60లక్షల వరకు ఉంటుందని తెలిసినప్పటికీ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎన్నికల నిఘా బృందాలు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది.

**కామారెడ్డిలో కన్నడ నేతలు**

పోలింగ్‌కు ముందు రోజు అలజడి సృష్టించి జనాల్లో భయాందోళనలు సృష్టించాలనే ఆలోచనలో కాంగ్రెస్ కుట్రలకు పాల్పడుతోందని తెలుస్తోంది. భిక్కనూర్‌లో సోమవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా కర్ణాటకకు చెందిన వాహనాల్లో పలువురు సంచరించారు. స్థానిక నాయకులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తనిఖీలు చేపట్టగా సర్వే కోసం వచ్చినట్లుగా వారు సమాధానం ఇచ్చారు. పోలీసులు మాత్రం పరస్పర ఫిర్యాదులు స్వీకరించారు. కామారెడ్డిలో తిరుగుతున్న కన్నడ వ్యక్తులు కాంగ్రెస్ సానుభూతిపరులేనని అనుమానం వ్యక్తం అవుతున్నది. మొదట్నుంచి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి కర్ణాటకకు చెందిన ముఖ్య నేతలంతా తెర వెనుక సపోర్టు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

- లాయర్ల సంక్షేమ నిధికి రూ.100కోట్లు జమ చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- లాయర్లతో పాటు కుటుంబసభ్యులకు రూ.2 లక్షల బీమా





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ దాదన్నగారి మధుసూదన్ రావు

నిజామాబాద్ లీగల్/ ఖలీల్‌వాడి, నవంబర్ 28 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి అభ్యర్థులను ఆదరించి, భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ దాదన్నగారి మధుసూదన్ రావు కోరారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర మలిదశ ఉద్యమంలో న్యాయవాదుల ఉద్యమస్ఫూర్తిని గుర్తించిన సీఎం కేసీఆర్.. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ. 100 కోట్లు కేటాయించి, ఆర్థిక అండగా నిలిచారని తెలిపారు. కరోనా కష్టకాలంలో కుటుంబ సభ్యుడివలె ఆర్థిక తోడ్పాటును అందించారని అన్నారు. న్యాయవాదులతో పాటు వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఆరోగ్యబీమా కల్పించి ఆదరించారని తెలిపారు. తెలంగాణ సమాజమే తన కుటుంబమని, అందరి ప్రగతిని ఆకాంక్షించిన ఏకైక ప్రజా నాయకుడు కేసీఆర్ అన్నారు. రానున్న రోజుల్లో న్యాయవాదుల ఆరోగ్య బీమాను రూ. 5 లక్షలకు పెంచే విధంగా చూస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని చెప్పారు. సకలజనుల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పదేండ్ల పాలన సాగిందని కొనియాడారు. న్యాయవాదులతోపాటు అన్ని వర్గాలకు పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.

NT-314461

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.